క్లుప్తంగా

పాకల రైల్వేగేటు వద్ద మరమ్మతులు



పాకల రైల్వే గేటు వద్ద మరమ్మత్తులు చేస్తున్న రైల్వే కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: పాకల రైల్వే గేటు వద్ద శనివారం రైల్వే అధికారులు ట్రాక్ పనులు చేపట్టారు. ఇటీవల 15 రోజుల క్రితం ట్రాక్ మరమ్మతులు చేసిన రైల్వే అధికారులు ట్రాక్ వద్ద పనులు సక్రమంగా చేయకపోవడంతో కంకర లేచి వాహనదారులు రైల్వేగేటు దాటే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ×గేటు వద్ద కంకర....అధికారులు కానరా? అన్న శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై వెంటనే స్పందించిన రైల్వే అధికారులు గేటు వద్ద వాహనాలు పోయేందుకు వీలుగా ట్రాక్ వద్ద కంకర లేవకుండా తారుతో మరమ్మతులు చేశారు.

నేడు కార్యకర్తలకు అందుబాటులో బుర్రా

కందుకూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదివారం ఉదయం 10గంటల నుంచి పామూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్యాలయంలో బుర్రాను కలవచ్చని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు పట్టికున్నారు. మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు కందుకూరు సెబ్ ఎస్సై దీప్తికరంత్ సిబ్బంది సాయంతో దాడి చేసి పెద్దపవని గ్రామ శివారులో అదుపులోనికి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను లింగసముద్రం పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలంలోని నేతివారిపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో ఈ నెల 8న కోరం లేక ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా పడింది. వాయిదా పడిన ఎన్నికను శనివారం నిర్వహించినట్లు ఎంఈఓ సురేఖ, పి.రామారావు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొండపి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సైన్స్ సబ్జెక్టుపై పట్టు సాధించాలి

పీసీపల్లి: సైన్స్ సబ్జెక్టుపై విద్యార్థులు పట్టు సాధించేంత వరకు ఉపాధ్యాయులు బోధించాలని మార్కాపురం కనిగిరి డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్ అన్నారు: పామూరు, సీఎస్ పురం, పీసీపల్లి మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయికి పోయేలా ఉపాధ్యాయులు చొరవచూపాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈయన వెంట ఎంఈఓ శ్రీనివాస చారి ఉపాధ్యాయులు ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ.18,29,025

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.18,29,025 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.29,920, తలనీలాలు రూ.65,400, ప్రత్యేక దర్శనం రూ.4,11,900, లడ్డుప్రసాదాలు రూ.2,04,985, అన్నదానం రూ.10,27,963, రూమ్‌అద్దెలు రూ.33,410 వచ్చినట్లు పేర్కొన్నారు. వలేటివారిపాలెం గ్రామానికి చెందిన వలేటి నాగేశ్వరావు, ఆదిలక్ష్మి దంపతులు దేవస్థానం అన్నదానం కార్యక్రమానికి రూ.3,60,000 విరాళం ఇచ్చారు.

పొగాకు గరిష్ట ధర రూ.358

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర రూ.358 పలికిందని వేలంనిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్ద కల్లగుంట గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1130 బేళ్లను తీసుకురాగా 937 బేళ్లనుకొనుగోలు చేసి వివిధ కారణాలతో 193 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.299.44 పలికింది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘాతుకంపై గళమెత్తిన వైద్యులు



కనిగిరిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది



సింగరాయకొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డ వైద్య ఆరోగ్య సిబ్బంది

కనిగిరి రూరల్: వైద్య విద్యార్థినిపై హత్యాచారం ఘటనకు నిరసనగా శనివారం కనిగిరిలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన తెలియజేశారు. అనంతరం నినాదాలతో ప్లకార్డులు తీసుకుని ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ జాన్ ఇర్విన్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై జరిగిన సామూహిక లైంగిక దాడి, హత్య సమాజానికే మచ్చలాంటిదన్నారు. ఈ ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై విచారణ వేగవంతంగా నిర్వహించి, ప్రత్యేక కోర్టు ద్వారా నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ యోషితా రెడ్డి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌ను హతమార్చిన మానవ మృగాలను నడిరోడ్డులో ఉరితీయాలని డిమాండ్ చేశారు. వైద్య శాలల్లో పనిచేసే మహిళా వైద్యులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా వైద్యులపై అకృత్యాలకు పాల్పడే వారిని శిక్షించేందుకు ప్రత్యేక, కఠినమైన చట్టాలను చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటన అత్యంత హేయమైనదన్నారు. మహిళా వైద్యుల సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు సుబ్బయ్య, కిరణ్‌మై, ప్రియార్ష నంద, చంద్రేష్, వైద్య సిబ్బంది రమేష్ బాబు, శంకర్, మునింద్రమ్మ పాల్గొన్నారు.

పామూరు: వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి, హత్య చేసిన దుండగులను సత్వరం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ఎం విజయ్‌కుమార్, ప్రైవేట్ డాక్టర్స్ యూనియన్ సీనియర్ డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. పామూరులో ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, ఆశాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు వైద్యసేవలు నిలిపివేసి పామూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ చెన్నకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజల ఆరోగ్యాలను కాపాడే డాక్టర్లకు దేశంలో రక్షణ కరువైందని, నిత్యం ఏదో ఒక ప్రాంతంలో డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయని, డాక్టర్ల భద్రతకు ప్రత్యేకచట్టం తీసుకురావాలని డిమాండ్‌చేశారు. డాక్టర్ గద్దే ఏడుకొండలు, డాక్టర్ రవళి ప్రియాంక, డాక్టర్ దుబీనా, వై.శ్రీనివాసులు, వెంకట్‌కాళే, కె.సురేష్, డాక్టర్ టి.రమాదేవి, డాక్టర్ ఎన్‌వీఎస్ఎస్.దీక్షితులు, మల్లికార్జున, సుబాని, శ్రీకాంత్, కార్తీక్, నయీమ్, బ్రహ్మానందం, పెరుగు శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై దారుణ ఘటనపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ చైతన్య కృష్ణ డిమాండ్ చేశారు. నో సేఫ్టీ నో డ్యూటీ అనే నినాదంతో శనివారం వైద్య, ఆరోగ్య సిబ్బంది, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చైతన్య కృష్ణ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడే మాకే రక్షణ లేకపోతే విధులు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఒక రోజు ఓపీ విధులు బహిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కందుకూరు రోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. డాక్టర్లు ధీరేంధర్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రాకేష్‌కుమార్, డాక్టర్ ఉజ్వల, డాక్టర్ లీనా రాఫెల్, 104 డ్రైవర్ శ్రీకాంత్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



పామూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది, ఆశాలు



సింగరాయకొండలో మాట్లాడుతున్న జిల్లా అకడమిక్ అధికారి రమేష్

విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీయాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యార్థుల నైపుణ్యాలు వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకడమిక్ అధికారి ఎం రమేష్ అన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో జరుగుతున్న మండల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను ఏవిధంగా మెరుగుపరచాలో ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తరువాత కామేపల్లి ఎస్సీ కాలనీలోని భవిత విద్యార్థి ఇంటికి వెళ్లి స్వయంగా పరిశీలించారు. ఎంఈఓ బి.నాగేంద్రవదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని జిల్లా అకడమిక్ అధికారి ఎం రమేష్ సూచించారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రమేష్ మాట్లాడుతూ పాఠశాలలోని పీఏఎల్ ల్యాబ్ సక్రమంగా వినియోగం జరిగితే విద్యార్థుల్లో స్వీయ అభ్యసనం మెరుగుపడుతుందని తెలిపారు. హెచ్ఎం ఎం శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేషన్‌టీచర్ బి.నరసింగరావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన పారిశుధ్య కార్మికులు

సింగరాయకొండ: సింగరాయకొండ మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం ముందస్తు సమాచారం లేకుండా విధులు బహిష్కరించడంతో రోడ్లన్నీ చెత్తతో నిండిపోయాయి. దీంతో పంచాయతీలోని వీధులన్నీ చెత్తతో నిండిపోయాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామకోటయ్యను వివరణ కోరగా..కార్మికులకు ప్రతి నెలా జీతాలు చెల్లిస్తున్నామని, అయితే 2022–23 మధ్య జీతాల బకాయి ఉందన్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేల వరకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. సాయంత్రం పారిశుధ్య కార్మికులను పిలిపించి మాట్లాడమని, సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఇఓ రామకోటయ్య

వివాహ వేడుకల్లో మంత్రి సురేష్



వివాహ వేడుకల్లో పాల్గొన్న సురేష్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం నర్శింగోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డి మాలకొండయ్య కుమార్తె మౌనిక వివాహ వేడుకల్లో శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వధువు మౌనికను ఆశీర్వదించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, కనపర్తి శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న పీడీ

గుడ్లూరు (కందుకూరు రూరల్): మండలంలోని చేవూరు గ్రామంలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ హెనా సుజన ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ స్కూల్ కార్యక్రమాలు బాగా చేయించాలన్నారు. యాప్ ద్వారా కార్యకర్తలు ఎలా పని చేస్తున్నారో పరిశీలించారు. ఉలవపాడు ఐసీడీఎస్ సీడీపీఓ టి.అరుణ, సూపర్‌వైజర్ కామేశ్వరి ఉన్నారు.

వైభవంగా సీతారాములవారి ఆలయ వార్షికోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తర్లుపాడు: స్థానిక బీసీకాలనీలోని పట్టాభి సీతారామ స్వామి వారి మూడో వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ఘనంగా కల్యాణం నిర్వహించారు. తర్లుపాడుతో పాటు నాయుడుపల్లి, మీర్జపేట, సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసంతర్పన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

దశలవారీగా సైడ్ కాలువల నిర్మాణం



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా సైడు కాలువల నిర్మాణాలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా మున్సిపాలిటీలోని ఒకటవ వార్డులో శనివారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా సాయిబాబా గుడి వీధిలో ప్రజలు డ్రైనేజీ కాలువలు లేక అవస్థలు పడుతున్నామని, దీంతో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని చైర్మన్‌కు విన్నవించారు. దీంతో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గతంలో కాలువ నిర్మాణానికి రూ.11 లక్షలు మంజూరు చేశామని, కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. కౌన్సిలర్ రామన బోయిన ప్రశాంతి శ్రీను, ఎమినిటి కార్యదర్శి బ్రహ్మారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ కార్యదర్శి రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ భూములపై కేంద్ర ప్రభుత్వం కుట్ర

పామూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల భూములు, ఆస్తులను అదానీ, అంబానీలకు కట్టబెట్టే కుట్ర చేస్తోందని ఆవాజ్ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆవాజ్‌కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం స్థానిక సీపీఎం కార్యాలయంలోని పప్పు వెంకోబరావు హాలులో షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. హనీఫ్ మాట్లాడుతూ ముస్లిం సంఘాలతో కలిపి ఈ నెల 23వ తేదీన గుంటూరులో నిరసన చేపట్టే నిరసన ర్యాలీ జయప్రదం చేయాలని కోరారు. పార్లమెంటుల్లో వక్ఫ్‌బోర్డ్ ఆస్తులకు సంబంధించి చట్టసవరణబిల్లు బీజేపీ కుట్రకు నిదర్శనమన్నారు. సమావేశంలో పలువురు ఆవాజ్ కమిటీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా నాయకులు హనీఫ్

అనధికారికంగా పొగాకు బ్యార్నీలు నిర్మించరాదు

టంగుటూరు: బోర్డు అనుమతి లేకుండా అనధికారికంగా పొగాకు బ్యార్నీలు నిర్మించరాదని, ఇప్పటికే అనధికారికంగా నిర్మిస్తున్న 85 మందికి పైగా బ్యార్నీల యజమానులకు నోటీసులు ఇచ్చామని వేలం నిర్వహణధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకి చెందిన రైతులు 1031 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 941 కొనుగోలు చేయగా 90 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 358, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ. 329.17గా నమోదైంది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

విద్యా ప్రవేశ్ కార్యక్రమాలు అమలుచేయాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యాప్రవేశ్ పేరుతో పాఠశాలల్లో 90 రోజుల కార్యక్రమాలను ఉపాధ్యాయులు అమలుచేయాలని మండల విద్యాశాఖాదికారులు రాజాల కొండారెడ్డి, జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో శనివారం జరుగుతున్న పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమాలను వారు సందర్శించారు. పిల్లలలో మానసిక, శారీరక అభివృద్ధికి దోహదంచేసేలా, తార్కిక ఆలోచనా శక్తిని రేకిత్తించేలా కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెసన్‌ప్లాన్స్ రూపొందించుకొని విద్యాబోధన చేయాలన్నారు. పాఠశాల పరిధిలోని డ్రాపౌట్ విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీలకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, ఉపాధ్యాయులు కమిటీ సభ్యులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు చేయాలని సూచించారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు బుడాల డేవిడ్, షేక్.ఖాదరున్నీసాబేగం, సీఆర్‌పీలు వల్లంశెట్టి సతీష్ కుమార్, బేగం, మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

అనర్హులుంటే తొలగించండి

హనుమంతుని పాడు: పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాల్లో అనర్హులుంటే తొలగించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారీతనంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రధానంగా తాగునీటి సమస్య, పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అగ్రిగోల్డ్, దేవదాయ, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తక్షణం విచారించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను సూచించారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ లలిత, తహసీల్దార్ బి.దిలీప్‌కుమార్, సర్పంచ్ కె.రాజారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ఆలయాల్లో భక్తుల సందడి



అలంకరణలో శ్రీవారు



పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి

కొనకనమిట్ల: శ్రావణ మాసం శనివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో, కొనకనమిట్ల రామధూత క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయం, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి, పోలేరమ్మతల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు అన్నదానం

కందుకూరు రూరల్: వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్ కోట వెంకటేశ్వర్లు పెళ్లిరోజును పురస్కరించుకొని పట్టణంలోని జనార్ధన కాలనీ ప్రాథమిక పాఠశాలలో అన్నదానం చేశారు. తొలుత పిల్లల మధ్య కేక్ కట్ చేసి అనంతరం మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయురాలు జి.రామలక్ష్మమ్మ, వాసవీ క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు, సెక్రటరీ ఇన్నమూరి శ్రీనివాసులు, ట్రెజరర్ చీదెళ్ల కృష్ణ, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కొత్తూరి నటరాజకుమారి, ఆర్‌సీఏ గుర్రం అల్లూరయ్య, కోట నరసింహం, చీదెళ్ల సోమశేఖర్, చీదెళ్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు